క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల పరిశీలన

బత్తలపల్లి: మండలంలోని పోలింగ్ కేంద్రాలను, ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని తహసీల్దార్ యుగేశ్వరిదేవి శనివారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఓటరుగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. జాబితాలో తప్పులుంటే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో బీఎల్‌ఓలు దరఖాస్తులు స్వీకరిస్తున్నారన్నారు.

సీసీ రోడ్డు పనులకు శ్రీకారం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: కాలేపల్లిలో ఉపాధి హామీ నిధులు రూ.12 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు సర్పంచ్ రూపా, ఎంపీటీసీ లోకేష్ శనివారం ప్రారంభించారు. తమ గ్రామానికి సీసీ రోడ్డు మంజూరు చేయాలని గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానికులు ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డిని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే సీసీ రోడ్డు మంజూరు చేయించారని వైఎస్సార్‌సీపీ నాయకుడు రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు.

మంత్రులను కలిసిన ఎస్పీ



మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీమాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: సీఎం వైఎస్ జగన్ పర్యటన ఏర్పాట్లు పరిశీలించడానికి శనివారం పుట్టపర్తికి విచ్చేసిన రాష్ట్ర మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఇన్‌చార్జ్ మంత్రి గుమ్మనూరు జయరాంను ఎస్పీ మాధవరెడ్డి మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. అదేవిధంగా పాలసముద్రం వద్ద ఉన్న నాసిన్ కేంద్రంలో వివిధ అభివృద్ధి అంశాలు చర్చించేందుకు విచ్చేసిన ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు.

స్వశక్తితో స్వయం ఉపాధి



శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

బత్తలపల్లి: మహిళలు ఇతరులపై ఆధారపడకుండా స్వశక్తితో స్వయం ఉపాధి పొందే మార్గాలను ఎంచుకోవాలని రూడ్‌సెట్ డైరెక్టర్ విజయలక్ష్మీ, ఎంపీపీ బగ్గిరి త్రివేణి పేర్కొన్నారు. బత్తలపల్లిలోని పాత వెలుగు కార్యాలయంలో రూడ్‌సెట్ సహకారంతో కుట్టులో శిక్షణ పొందిన 35 మంది స్వయం సహాయక సంఘాల మహిళలకు శనివారం వారు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. యూనియన్ బ్యాంక్ మేనేజర్ ఏరియా కోఆర్డినేటర్ రామేశ్వర్‌రెడ్డి, ఏపీఎం సుదర్శన్‌రాజు, జిల్లా బ్యాంక్ లింకేజీ యాంకర్ పర్సన్ పద్మావతి, ఉష పాల్గొన్నారు.

కరువు రైతులను ఆదుకోవాలి

బత్తలపల్లి: వర్షాభావంతో మండలంలో ఎండిపోయిన వేరుశనగ, ఆముదం, కంది పంటలను శనివారం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఓబులేసు, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాటమయ్య పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి ఎకరాకు వేరుశనగకు రూ.40వేలు, కందికి రూ.35వేలు ప్రకటించి రైతులను ఆదుకోవాలని, కరువు మండలాల్లో ఏడాది పాటు ఉపాధి పనులను చేపట్టాలని డిమాండ్ చేశారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో అందరికీ ఆరోగ్యం



కంటి అద్దాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి తెలిపారు. పట్టణంలోని సంజయ్‌నగర్, బోయవీధిలో శనివారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అనంతరం వైద్యులు 517 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. 154 మందికి కంటి పరీక్షలు 13 మందికి కంటి అద్దాలు అందజేశారు.కౌన్సిలర్ పెనుజూరు నాగరాజు పాల్గొన్నారు.

ఓటరు నమోదుకు 19 దరఖాస్తులు

కనగానపల్లి: మండలంలోని 37 పోలింగ్ కేంద్రాల వద్ద నిర్వహించిన ఓటరు నమోదు కార్యక్రమంలో 19 దరఖాస్తులు స్వీకరించినట్లు డీటీ ప్రసాద్ తెలిపారు. ఆదివారం కూడా ఓటరు నమోదు కార్యక్రమం ఉంటుంది.



'సామాజిక సాధికార బస్సు యాత్ర' సభలో మాట్లాడుతున్న ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి



బత్తలపల్లి నుంచి సభకు తరలివెళ్తున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు

ధర్మవరం జన తరంగం

ధర్మవరం పట్టణాన్ని జనతరంగం ఉవ్వెత్తున తాకింది. సీఎం వైఎస్ జగనన్న తెచ్చిన సామాజిక విప్లవంతో చైతన్యవంతులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజలు శనివారం ధర్మవరంలో జరిగిన 'సామాజిక సాధికార బస్సు యాత్ర'కు పోటెత్తారు. శ్రీ సత్యసాయి జిల్లా నలుమూలల నుంచి భారీగా తరలివచ్చారు. దీంతో ధర్మవరం పట్టణం ఎటు చూసినా జనసునామీని తలపించింది. యువకులు బైకు ర్యాలీలతో జైజగన్ నినాదాలతో బహిరంగ సభకు తరలివచ్చారు.
–ధర్మవరం



సభను తిలకిస్తూ ఈలలు వేస్తున్న ప్రజలు





మహనీయుల చిత్రపటాలకు పుష్పాంజలి, ధర్మవరం రూరల్ నుంచి 'సామాజిక సాధికార బస్సు యాత్ర'కు తరలివస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

సీఎం సభ జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



మాట్లాడుతున్న కదిరి ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

- ఎమ్మెల్యేలు దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, పీవీ సిద్దారెడ్డి, తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

పుట్టపర్తి అర్బన్: రైతుభరోసా– పీఎం కిసాన్ నిధులు రైతులు ఖాతాల్లోకి జమ చేసేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 7న సత్యసాయి జిల్లాకు రానున్న నేపథ్యంలో పుట్టపర్తిలో ఏర్పాటు చేసే బహిరంగ సభకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు, రైతులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పుట్టపర్తి ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో, బుక్కపట్నం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి నేటి వరకు ఎన్నో సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. ఈ పథకాలతో రాష్ట్రంలో ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూరిందన్నారు. పుట్టపర్తి నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ సంక్షేమం అందిందన్నారు. లబ్ధి చేకూరిన ప్రతి ఒక్కరూ బహిరంగ సభకు వచ్చేలా చూడాలన్నారు. పుట్టపర్తి, బుక్కపట్నం ఎంపీపీలు ఏవీ రమణారెడ్డి, శ్రీధర్ రెడ్డి, వైస్ ఎంపీపీ రంగన్న, కన్వీనర్లు నరసారెడ్డి, సుధాకరరెడ్డి, నాయకులు గంగాద్రి, మాధవరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

నల్లమాడ: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ పుట్టపర్తిలో జరిగే సీఎం బహిరంగ సభకు మండలం నుంచి పార్టీ శ్రేణులతో పాటు అన్ని వర్గాల ప్రజలు భారీగా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు ఎస్.రామచంద్రారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కే. సూర్యనారాయణ, మాజీ కన్వీనర్ పొరకల రామాంజనేయులు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి టీడీ కేశరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షులు బీఆర్ కేశప్ప, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు పొరకల రమణ, అంజినాయక్, పార్టీ పరిశీలకులు పీవీ భాస్కర్‌రెడ్డి, నాగమోహన్‌రెడ్డి, సహకార సంఘం అధ్యక్షుడు ఏ.గంగిరెడ్డి, వ్యవసాయ సలహా బోర్డు చైర్మెన్ రఘునాథరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు కే.రవిచంద్రారెడ్డి, మార్కెట్ యార్డు డైరెక్టర్ ఆసాది గంగిశెట్టి, అశ్వర్థనారాయణ పాల్గొన్నారు.

కొత్తచెరువు: సీఎం వైఎస్ జగన్ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. మండల కన్వీనర్ జగన్మోహన్ రెడ్డి, రెడ్డప్పరెడ్డి, మటన్ శంకర్, పుట్టపర్తి ఎంపీపీ రమణారెడ్డి, మాజీ సర్పంచ్ శ్యాంసుందర్ రెడ్డి, నాగరాజు, టౌన్ కన్వీనర్ భాస్కర్, అంగడి సోమశేఖర్ రెడ్డి, హనుమంతరెడ్డి, కో ఆప్షన్ మెంబర్ ముస్వర్ నరేంద్ర రెడ్డి, వాల్మీకి శంకర, యల్లప్ప, వెంకటరాముడు, రమణారెడ్డి, పోతిరెడ్డి, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

ఓడీచెరువు: సీఎం జగనన్న పర్యటనను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి కోరారు. మండల కేంద్రంలో శనివారం ఆయన సమావేశమై మాట్లాడారు. మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీనివాస రెడ్డి, జెడ్పీటీసీ దామోదర్ రెడ్డి, మండల కన్వీనర్ రాజునాయుడు, అగ్రి బోర్డు చైర్మన్ లక్ష్మి రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఆనంద రెడ్డి, సింగిల్‌విండో ప్రెసిడెంట్ రామసుబ్బారెడ్డి, మండల బూత్ లెవెల్ మేనేజర్ గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

అమడగూరు: సీఎం జగన్ పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం చౌడేశ్వరీ కల్యాణ మండపంలో వైఎస్సార్‌సీపీ నాయకులకు, కార్యకర్తలతో సమావేశమై మాట్లాడారు. మండలం నుంచి 100 బస్సుల్లో కార్యకర్తలు తరలివచ్చి సభను జయప్రదం చేయాలని కోరారు. ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, కన్వీనర్ సూర్యనారాయణరెడ్డి, పుట్టపర్తి మున్సిపాలిటీ వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు శివశంకర్‌రెడ్డి, రాష్ట్ర హౌసింగ్ డైరెక్టర్ శేషూరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ జయప్ప, టౌన్ కన్వీనర్ సుధాకర్‌రాజు పాల్గొన్నారు.

సభకు తరలిరండి

కదిరి: ఈ నెల 7వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టపర్తి పర్యటనను విజయవంతం చేద్దామని కదిరి ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి పిలుపునిచ్చారు. సీఎం పర్యటనపై శనివారం ఎమ్మెల్యే స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిలర్లు, పలువురు అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ..వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టిందని, వీటి ద్వారా లబ్ధి పొందుతున్న ప్రతి ఒక్కరినీ సీఎం పర్యటనకు ఆహ్వానిద్దామని పేర్కొన్నారు. జగనన్న ద్వారా ఎవరెవరికి ఏఏ లబ్ధి చేకూరిందో ప్రజలకు వివరించి వారు స్వచ్ఛందంగా హాజరయ్యేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు. శ్రీ సత్యసాయి జిల్లాకు పుట్టపర్తిని జిల్లా కేంద్రం చేయడం చాలా సంతోషదాయకమని, అందుకే పుట్టపర్తికి సమీపంలో ఉన్న పుట్టపర్తి, కదిరి, ధర్మవరం, పెనుకొండ నియోజకవర్గాల ప్రజలందరూ పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ పరికి నజీమున్నీసా సాదిక్, వైస్ చైర్మెన్‌లు గంగాదేవి, రాజశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు కొలిమి జిలాన్, పలువురు కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

7న సీఎం పర్యటనను విజయవంతం చేద్దాం

చెన్నేకొత్తపల్లి: ఈనెల 7న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టపర్తి పర్యటనను విజయవంతం చేద్దామని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఆయన పార్టీ కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతాంగానికి అన్ని విధాలుగా అండగా నిలిచి, ఆదుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జిల్లాకు విచ్చేస్తున్న సందర్భంగా రైతులందరూ పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ అంజలి, జెడ్పీటీసీ గోవింద రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నర్సిరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

నేలకోట తండాను సందర్శించిన ఎస్టీ కమిషన్ సభ్యుడు

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని నేలకోట తండాను శనివారం రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ సందర్శించారు. గ్రామంలో మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. వేర్వేరు ఘటనల్లో ఇటీవల మృతి చెందిన వడిత్యా షణ్ముఖ నాయక్, బాణావత్ దుర్గా నాయక్ కుటుంబాలను పరామర్శించారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందేలా కృషి చేస్తానన్నారు. సర్పంచ్ శాంతిబాయి, డిప్యూటీ తహసీల్దార్ ఈశ్వరయ్య, రూరల్ ఎస్ఐ విజయ్ కుమార్ నాయక్, గిరిజన ప్రజా సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షుడు జి. మల్లికార్జున నాయక్, రాయల సీమ జిల్లాల అధ్యక్షుడు భాస్కర్ నాయక్, రాష్ట్ర యువజన నాయకుడు ఇస్లావత్ హనుమంతు నాయక్ పాల్గొన్నారు.



మృతుని కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ప్రభుత్వం వెన్నుదన్ను

- డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి

తాడిమర్రి: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలిచిందని డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ధర్మవరంలో జరిగిన సామాజిక సాధికార బస్సుయాత్రకు మండలంలోని గ్రామాల నుంచి ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, భారీ సంఖ్యలో జనంతో ఆయన ధర్మవరం తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలను ఓటర్లుగానే వాడుకున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు మంత్రి పదవులు, రాజ్యసభ పదవులు కట్టబెట్టారన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్ సీపీకి ఓటు వేసి ఎమ్మెల్యేగా కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డిని గెలిపించి, సీఎం జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపు నిచ్చారు. ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు వైటీ చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు పొరాళ్ల విజయభాస్కర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షులు జొల్లిరెడ్డి అశ్వర్థ, సచివాలయాల మండల కన్వీనర్ అల్లే సాయినాథ్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ ఆర్వేటి రామాంజినేయులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ట్యాబ్‌ల నిర్వహణపై శ్రద్ధచూపండి

ఎన్పీకుంట: బైజూస్ కంటెంట్ కలిగిన ట్యాబ్‌ల వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఎంపీపీ ఈటెరాము విద్యాశాఖ అధికారులకు సూచించారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు.ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించే క్రమంలో 9వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను అందించిందన్నారు. వాటి నిర్వహణపై శ్రద్ధ పెట్టాలన్నారు. వైఎస్సార్ క్రాంతి పథకంలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ కింద ప్రభుత్వం మంజూరు చేసిన నిధులకు సంబంధించి ఇన్‌ఛార్జ్ ఏపీఎంను ఆరా తీయగా పొంతన లేని సమాధానం చెప్పడంతో ఎంపీపీ, ఎంపీడీఓలు ఏపీఎంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వైస్ ఎంపీపీ సంపూర్ణ మండల కన్వీనర్, ఎంపీటీసీ సభ్యుడు కొత్తరంగారెడ్డి, ఎంపీడీఓ ఆదినారాయణ, సింగిల్ విండో అధ్యక్షుడు జగదీశ్వర్ రెడ్డి, ఎంపీటీసీలు మగ్బూల్‌బీ, లక్ష్మీదేవి, సరస్వతి, క్రిష్టమ్మ, తిమ్మారెడ్డి, సర్పంచులు ఈటెరాధ, విష్ణుమూర్తి కె.దిల్షాద్, నాగమునీశ్వరనాయుడు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందనలు

ముదిగుబ్బ: రాష్ట్ర స్థాయి అండర్–14 వాలీబాల్ పోటీలకు ఎంపికైన ముదిగుబ్బ బాలుర ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి ఎస్.భరత్‌ను శనివారం పీఈటీ రాజశేఖర్, ఉపాధ్యాయులు అభినందించారు.

నిందితుడిపై పోక్సో కేసు నమోదు

కదిరి అర్బన్: మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన కదిరి రూరల్ మండలానికి చెందిన ప్రసన్నకుమార్ అనే యువకుడిపై శనివారం రూరల్ పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు రూరల్ అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐ సూర్యనారాయణ తెలిపారు. నిందితుడు మైనర్‌బాలికపై అత్యాచారానికి పాల్పడి ఆ దృశ్యాలను వీడియో తీసి వాట్సాప్ స్టేటస్‌లో పెట్టుకొని బాధితురాలిని బెదిరించాడు. విషయం తెలుసుకున్న బాలిక తండ్రి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

కొనసాగుతున్న సెబ్ దాడులు

పుట్టపర్తి టౌన్: అక్రమ ఇసుక, మద్యం రవాణాపై సెబ్ అధికారులు దాడులు కొనసాగించారు. తనకల్లు సెబ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 4 టన్నుల ఇసుక సీజ్ చేశారు. పుట్టపర్తి సెబ్ స్టేషన్ పరిధిలో ఇద్దరు వ్యక్తుల నుంచి 67 కర్ణాటక మద్యం పాకెట్లు, ముదిగుబ్బ మండలం గడ్డంపల్లి తండాలో 70 లీటర్ల నాటుసారా, కదిరి మండలం బత్తలపల్లి తండాలో 150 లీటర్ల బెల్లం ఊట సారా ధ్వంసం చేశారు.

గ్రంథాలయాలతో మేథాశక్తి మెరుగు

ధర్మవరం అర్బన్: గ్రంథాలయాలతో మేథాశక్తి మెరుగుపడుతుందని సబ్‌జైల్ సూపరింటెండెంట్ బ్రహ్మారెడ్డి తెలిపారు. పట్టణంలోని గ్రంథాలయంలో శనివారం జిల్లా గ్రంథాలయశాఖ అందించిన పుస్తకాలను సబ్‌జైలు సూపరింటెండెంట్ విద్యార్థులకు పంపిణీ గ్రంథాలయాధికారిణి అంజలి సౌభాగ్యవతి, పాల్గొన్నారు.

30న యుద్ధభేరి మహాసభ

పుట్టపర్తి టౌన్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వర్‌రావ్ ఆధ్వర్యంలో ఈనెల 30న విజయవాడలో మాదిగల యుద్ధభేరి మహాసభ నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి కుంటిమద్ది ఓబుళేసు తెలిపారు. ఈమేరకు శనివారం పుట్టపర్తి పట్టణంలో సాయిఆరామంలో కరపత్రాలు విడుదల చేశారు.

నిందితుల అరెస్ట్

కదిరి టౌన్: అమృతవల్లి మహిళా డిగ్రీ కళాశాల మైదానంలో గతనెల 18న దిలీప్ కుమార్ అనే వ్యక్తిపై జరిగిన హత్యాయత్నానికి సంబంధించి నిందితులు పట్టుబడ్డారు. తలుపుల తిమ్మరాజు,జెట్టి అంజనేయులు, జెట్టి గంగన్న, జెట్టి భరత్‌కుమార్‌ను శనివారం అరెస్ట్ చేసినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

ఆంజనేయస్వామికి విశేష పూజలు



ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

నల్లచెరువు: శ్రీ పాలపాటి దిన్నె ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి విశేషపూజలు నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు నిర్వహించారు. భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భజన, అన్నదాన కార్యక్రమాలకు పులిమివాండ్లపల్లికి చెందిన మండెం.పాండురంగారెడ్డి, నిర్మల దంపతులు రూ.10వేలు విరాళంగా ఆలయ కమిటీ చైర్మన్ దేవరింటి భాస్కర్‌రెడ్డికి అందజేశారు.

ప్రారంభమైన చౌడేశ్వరిదేవి జ్యోతులు

బత్తలపల్లి: యర్రాయపల్లి గ్రామంలో వెలసిన శ్రీదేవాంగ చౌడేశ్వరి అమ్మవారి జ్యోతుల మహోత్సవ కార్యక్రమాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం గంగపూజ, అమ్మవారికి పంచామృత అభిషేకం నిర్వహించారు. రాత్రి 12 గంటల నుంచి జ్యోతులు ఆడించడం, సేవ కుమారుల విన్యాసాలుంటాయని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఉత్సవాల నిర్వాహకులు కోరారు.

చిన్న దిగువపల్లిలో పర్యటించిన ఆర్‌డీఓ



నిర్వాసితులతో మాట్లాడుతున్న ఆర్డీఓ వంశీకృష్ణ, తహసీల్దార్ సునీత

కదిరి అర్బన్: మండలపరిధిలోని చిన్న దిగువపల్లిలో ఆర్డీఓ వంశీకృష్ణ, తహసీల్దార్ సునీత శనివారం పర్యటించారు. చెర్లోపల్లి రిజర్వాయర్ ఊటనీటితో గ్రామంలో ఇళ్లు కోల్పోతున్న నిర్వాసితులతో మాట్లాడారు. నిర్వాసితులకు త్వరలో అనువైన ప్రదేశంలో ఇంటిపట్టాలు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు.

కరువు మండలంగా ప్రకటించాలి

గాండ్లపెంట: మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని శనివారం ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఎంపీపీ తాతం జగన్మోహన్ అధ్యక్షతన జరిగిన మండల సర్వ సభ్య సమావేశంలో సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఎంపీడీఓ రామానాయక్ మాట్లాడుతూ ప్రభుత్వానికి నివేదిక పంపనున్నట్లు చెప్పారు. గొర్రెలు, కోళ్ల పెంపకానికి ప్రభుత్వం రూ.20 లక్షల నుంచి రూ.కోటి వరకు రాయితీ మంజూరు చేస్తుందని, ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పశువైద్యాధికారి కేశవ నాయక్ తెలిపారు. స్వంత ఇంటిజాగా కలిగిన 486 మందికి ఇళ్లు మంజూరు చేస్తారని హౌసింగ్ ఏఈ చంద్రారెడ్డి తెలిపారు. కటారుపల్లి, తుమ్మలబైలు తండాలోని స్వయం సహాయక సంఘాల్లో అవకతవకలు జరిగినా ఎందుకు చర్యలు తీసుకోలేదంటూ ఎంపీపీ, వైఎస్ ఎంపీపీ గంగోజమ్మ, సర్పంచ్ రవీంద్రనాయక్, జిల్లా కోఆప్షన్‌లు సీసీని ప్రశ్నించారు. జెడ్పీటీసీ అమరావతి, వైస్ ఎంపీపీలు భారతి, గంగోజమ్మ, కోఆప్షన్ సభ్యుడు అమీర్ పాల్గొన్నారు.

శ్రీ ఖాద్రీ ఆలయం కిటకిట

కదిరి టౌన్: శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామికి శనివారం విశేష పూజలు నిర్వహించారు. వారాంతపు సెలవు కావడంతో ఆలయానికి భక్తులు పోటెత్తారు. జిల్లాతోపాటు అనంతపురం, వైఎస్సార్, చిత్తూరు జిల్లా, కర్ణాటక నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ధర్మప్రచార వారోత్సవాలు ప్రారంభం



ధర్మప్రచార వారోత్సవాలను ప్రారంభిస్తున్న ఆలయ చైర్మన్, ఈఓ,అర్చకులు

కదిరి టౌన్: రాష్ట్ర ప్రజల సౌభాగ్యం కోసం శ్రీఖాద్రీశ ఆలయంలో సనాతన ధర్మప్రచార వారోత్సవాలను ఆలయ చైర్మన్ గోపాలక్రిష్ణ, ఈఓ వి.శ్రీనివాసరెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోజూ సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రవచనాలు బోధించారు. అనంతరం చిన్నారులు భరతనాట్య ప్రదర్శనతో అలరించారు. వారికి బహుమతులు అందజేశారు.